క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరునక్షత్ర పూజలు



పంచామృత కలశాన్ని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై యున్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరునక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం భక్తులతో కలిసి అర్చకులు స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అడవి కాదు పట్టణమే



రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: ఇది ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధి షిర్డీనగర్‌లోని గాంధీజీ విగ్రహం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి. రహదారికి ఇరువైపులా మొక్కలు, తుప్పలు పెరిగిపోయి అడవిని తలపిస్తుంది. మొక్కలను అలాగే వదిలేసి తుప్పలను తొలగించాలని అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి తుప్పలను తొలగించకపోవడంతో పాముల సంచారం పెరిగిందంటున్నారు. దీనివల్ల చిన్నారులను ఈ దారిలో పంపాలంటే భయమేస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్మిషన్లపై దృష్టి సారించండి



ఏలేశ్వరంలో భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 వరలక్ష్మి

ఏలేశ్వరం: దివ్యాంగ చిన్నారుల అడ్మిషన్లపై దృష్టి సారించాలని భవిత కేంద్రం ఉపాధ్యాయులకు ఎంఈఓ-2 వరలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు భవిత కేంద్రంలో చేరేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో నిర్వహించిన సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పిల్లలందరూ తినేలా రుచిగా, శుచిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు వాణిపద్మజ, బుజ్జి, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో 'బ్లాక్ డే'



బ్లాక్ డే సభలో మాట్లాడుతున్న శింగిలిదేవి సత్తిరాజు

ప్రత్తిపాడు: స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం 'బ్లాక్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు మాట్లాడుతూ 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని, ఎన్నికల్లో పాల్గొనరాదని, ఆరేళ్ల పాటు ఎన్నికైన పదవిలో కొనసాగరాదంటూ కోర్టు తీర్పు వెలువడిందన్నారు. అదే రోజు ఎమర్జెన్సీ విధించి, రాజ్ నారాయణ్, ఎల్‌కే అద్వానీ, వాజ్‌పేయి, జార్జి ఫెర్నాండేజ్ వంటి ప్రతిపక్ష నాయకులను జైలో పెట్టించారన్నారు. ఆనాటి నుంచి బీజేపీ పార్టీ జూన్ 25న పార్టీ బ్లాక్ డే పాటిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కించు జోగిరాజు, దేవర రామకృష్ణ యాదవ్, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న ట్రస్టు భూములకు కౌలు వేలం

గోకవరం: స్థానిక వీపీబీ శాస్త్రి ట్రస్టు భూములకు జులై 2న మధ్యాహ్నం 3 గంటలకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీపీబీ శాస్త్రి ట్రస్టు సభ్యులు జిల్లా వైద్య ఆస్పత్రికి దానం చేసిన సర్వే నెంబర్ 10/1లో ఉన్న 2.57 ఎకరాలు, సర్వే నెంబర్ 245లో ఉన్న 0.71 ఎకరాలు, సర్వే నెంబర్ 249లో ఉన్న 2.74 ఎకరాలు, సర్వే నెంబర్ 236లో ఉన్న 3.97 ఎకరాలు కలిపి మొత్తంగా 10.05 ఎకరాల భూమికి పంట సాగు చేసుకోవడానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గతమెంతో ఘనం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం

- సిబ్బంది లేక మూతపడిన ప్రత్తిపాడు హోమియో వైద్యశాల
- రోగుల ఇక్కట్లను పట్టించుకోని ఆయుష్ అధికారులు



మూతపడిన ప్రత్తిపాడు ప్రభుత్వ హోమియో వైద్యశాల

ప్రత్తిపాడు: మైదాన, సబ్ ప్లాన్ ప్రజలకు హోమియో వైద్యాన్ని అందించే ప్రత్తిపాడు ప్రభుత్వ హోమియో వైద్యశాల సిబ్బంది లేకపోవడంతో ఏడు నెలలుగా మూత పడి ఉంది. దీర్ఘకాలిక వ్యాధులకు ఎక్కువగా వాడుకలో ఉండే హోమియో వైద్యం అధికారుల అనాలోచిత చర్యల కారణంగా ప్రజలకు దూరమవుతోంది. ముఖ్యంగా మధుమేహం, బీపీ, సొరియాసిస్, కీళ్ల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఎంతో మేలు చేసే హోమియో వైద్యశాలకు సిబ్బందిని నియమించడంలో ఆయుష్ శాఖ నిర్లిప్తత ప్రదర్శిస్తుంది. ఫలితంగా ప్రత్తిపాడు ప్రభుత్వ హోమియో వైద్యశాల చరిత్రలో కలిసిపోతుంది.

అప్పట్లో ఎంతో పేరు

గతంలో మండలంలోని ధర్మవరం గ్రామంలో హోమియో వైద్యశాలను నెలకొల్పారు. అప్పట్లో దీనికి సొంత భవనం లేకపోవడంతో అద్దె ఇంట్లో కొనసాగిస్తూ వచ్చారు. అద్దె భారం కావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దీన్ని 2008 డిసెంబర్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు తరలించారు. ఈసీహెచ్‌సీలో ఒకే ఒక గదిని కేటాయించడంతో సిబ్బంది, రోగులు సతమతమయ్యేవారు. అయితే ఈసీహెచ్‌సీలో నిర్మించిన క్వార్టర్లలో సిబ్బంది నివాసం ఉండకపోవడంతో అవి ఖాళీగా ఉండేవి. ఈ నేపథ్యంలో రోగుల ఇబ్బందుల దృష్ట్యా వైద్య శాలను సీహెచ్‌సీలోని సిబ్బంది క్వార్టర్లలోకి మార్చారు. కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, తొండంగి మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలకే కాకుండా ఇతర జిల్లా వాసులకు సైతం ఇక్కడ వైద్య సేవలు అందించేవారు. రోజూ 150కి పైగా ఓపీ నమోదయ్యేదంటే ఆ వైద్యశాల ఎంతటి ప్రాచుర్యం పొందిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రత్తిపాడు వైద్యశాల మూతపడింది.

సిబ్బందిని బదిలీ చేసి మూసేశారు

ప్రత్తిపాడు హోమియో ఆసుపత్రి ఒక వైద్యురాలు, ఫార్మసిస్టు, స్కావెంజర్ కమ్ స్వీపర్ పోస్టులతో నడిచేది. నాలుగేళ్ల క్రితం స్కావెంజర్ కం స్వీపర్ పనిచేస్తున్న వ్యక్తి పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచీ ఆ పోస్టును భర్తీ చేయలేదు. అనంతరం 2022 జూన్ 5న ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి ఎం.విజయ ప్రతిభతో పాటు ఫార్మసిస్‌ను బదిలీ చేశారు. పెద్దాపురం మండలం దివిలి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో స్కావెంజర్ కం స్వీపర్‌గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వరరావును బదిలీపై ప్రత్తిపాడు ఆసుపత్రికి పంపారు. కానీ వైద్యులు, ఫార్మసిస్ట్ లేకపోవడంతో ఆయన దివిలి వైద్యశాలలోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. సిబ్బంది లేని కారణంగా ఆస్పత్రి మూసివేశామంటూ పేపరుపై రాసి అతికించారు. అనంతరం స్థానికుల వినతుల మేరకు కోటనందూరు మండలం అల్లిపూడి నుంచి డిప్యూటేషన్‌పై వైద్యుడు, అటెండర్‌లను నియమించారు.



ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న ప్రభుత్వ హోమియో ఆస్పత్రి నూతన భవనం

ఏడాది తిరక్కుండానే సదరు వైద్యుడు రిటైర్డ్ కావడంతో యుటిలైజేషన్ ఆఫ్ సర్వీసెస్‌పై పెద్దాపురం మండలం దివిలి ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యురాలు పి.మాధవితో పాటు స్వీపర్ కం స్కావెంజర్‌ను నియమించారు. వారు వారానికి ఒకసారి ప్రతి గురువారం ప్రత్తిపాడు హోమియో ఆస్పత్రిలో సేవలందించేవారు. అయితే గత నవంబర్ నెలలో ఆమెను కాకినాడకు డిప్యూటేషన్‌పై పంపడంతో అప్పటి నుండి ప్రత్తిపాడు హోమియో వైద్యశాల మూతపడింది. రోజూ వ్యయప్రయాసల కోర్చి రోగులు రావడం, మూసి ఉన్న ఆస్పత్రిని చూసి నిరాశగా వెనుదిరగడం రివాజుగా మారింది.

ప్రారంభం కోసం ఎదురుచూపులు

ప్రత్తిపాడు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో నూతనంగా హోమియో ఆసుపత్రి నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) రూ.7.5 లక్షల నిధులను మంజూరు చేసింది. ఆ మేరకు భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పర్వత చిట్టిబాబు శంకుస్థాపన చేశారు. కాని టెండర్ల ప్రక్రియకు చాలా సమయం పట్టింది. ఎట్టకేలకు ఏడేళ్ల క్రితం దీని నిర్మాణాన్ని చేపట్టారు. రోగులను పరీక్షించేందుకు డాక్టర్‌కు ఒక గది, వెయిటింగ్ రూం, మందుల పంపిణీ చేసేందుకు ఫార్మాసిస్టుకు ఒక గది నిర్మించారు. నిర్మాణమైతే పూర్తయింది కాని ఏడాదిగా ప్రారంభం కోసం ఎదురుచూస్తోంది. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. సొంత భవనం నిర్మించినా ప్రారంభించకపోవడం, సిబ్బందిని నియమించకపోవడం చూస్తుంటే ప్రత్తిపాడు ప్రభుత్వ హోమియో ఆసుపత్రి భవిష్యత్తు ప్రశ్నార్థకమేనన్న చర్చ వినిపిస్తుంది.

అధికారులకు ఎన్నో లేఖలు రాశాం



ప్రత్తిపాడు హోమియో వైద్యశాలలో సిబ్బందిని నియమించాలని కోరుతూ ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌కు ఎన్నో లేఖలు రాశాం. గ్రామ ప్రజల సంతకాలను సేకరించి, వినతులు కూడా పంపాం. డిప్యూటేషన్‌పై వారానికి ఒకరోజు వైద్య సేవలు అందేలా సిబ్బందిని నియమించారు. మళ్లీ సిబ్బంది డిప్యూటేషన్లు రద్దు చేయడంతో ఈ ఆస్పత్రి మూతపడింది.

– కంచుమర్తి రాజు, ప్రత్తిపాడు

సిబ్బందిని నియమించాలి



ప్రత్తిపాడు హోమియో ఆస్పత్రికి దూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. వైద్య సిబ్బందిని బదిలీ చేయడంతో ఏడు నెలలుగా ఆస్పత్రి మూసే ఉంటోంది. రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం వైద్య సిబ్బందిని నియమించి, సేవలు యథావిధిగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించాలి.

– తటవర్తి అయ్యన్నదొర, టి.రాయవరం, ప్రత్తిపాడు మండలం

సూర్యదేవుని గ్రామోత్సవం



గోపాలపురంలో సూర్యనారాయణస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని గోపాలపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉషా పద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణస్వామి గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సూర్యనమస్కారాలు ఆచరించాలన్నారు. గ్రామోత్సవంలో దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు, చింతల సుబ్బారావు, చింతల చిన్నకాపు, సీతయ్య, గూడవల్లి సతీష్, కాసాని ఏడుకొండలు, వీరవల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సెబ్ సీఐ చిరంజీవి

ప్రత్తిపాడు: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ-సెబ్) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు గంజాయి, నల్లమందు వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను చక్కగా వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనుబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి.జోగేందర్, సెబ్ సిబ్బంది రాంబాబు, రాజు, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా మరమ్మతులు

- పంపా గేట్లకు రూ.30 లక్షలతో పనులు
- నాలుగో నంబర్ గేటుకు సగం మేర కొత్త రేకు
- మిగిలిన గేట్లకు రబ్బర్ సీల్స్, బ్లాక్ గ్రీజు, ఇతర పనులు
- పది రోజుల్లో పూర్తి
- ఈఈ శేషగిరిరావు వెల్లడి



మరమ్మతులు చేసేందుకు వీలుగా పైకి ఎత్తిన పంపా రిజర్వాయర్ గేట్లు

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 12,500 ఎకరాలకు సాగునీరు అందించే అన్నవరంలోని పంపా రిజర్వాయర్ గేట్ల మరమ్మతు పనులు చురుకుగా జరుగుతున్నాయి. జలాశయానికి వరద వచ్చే లోగానే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ పనులను పది రోజుల్లోనే పూర్తి చేస్తామని పెద్దాపురం ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. సుమారు రూ.30 లక్షలతో యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేయిస్తున్నామన్నారు. బ్యారేజీలోని ఐదు గేట్లలో నాలుగింటికి రబ్బర్ సీల్స్ వేస్తామని, బ్లాక్ గ్రీజు పెడతామని, కొత్త ఐరన్ రోప్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాలుగో నంబరు గేటు సగం రేకు పాడయినందున, దాని స్థానంలో కొత్త రేకు అమరుస్తున్నామని తెలిపారు. పంపా బ్యారేజీ నిర్మించి సుమారు 50 సంవత్సరాలు పూర్తయిందని, అప్పటి సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం అర్ధచంద్రాకారంగా గేట్లు నిర్మించారని చెప్పారు. అవి కొంచెం వంగడంతో గేట్ల నిర్వహణకు ఇబ్బంది కలుగుతోందన్నారు. భారీ వర్షాలు కురిసి, రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరి, సముద్రంలోకి నీరు విడుదల చేయాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు పంపా గేట్లు ఎత్తడంలో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. గత ఏడాది డిసెంబర్‌లో భారీ వర్షాల సమయంలో ఇదేవిధంగా బ్యారేజీ గేట్లు ఎత్తినపుడు నాలుగో నంబర్ గేటు కిందకు దిగలేదని, దానిని బలవంతంగా కిందకు దించాల్సి వచ్చిందని శేషగిరిరావు చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఈ గేట్లు మార్చాలని నిర్ణయించామన్నారు. ఈ ఖరీఫ్ వరకూ తాత్కాలిక మరమ్మతులు చేస్తామని, అనంతరం గేట్లు మారుస్తామని చెప్పారు. ఈ నెల మొదటి వారంలో గోదావరి డెల్టా ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు పంపా బ్యారేజీని పరిశీలించి, గేట్ల పరిస్థితిపై చర్చించారని తెలిపారు. బ్యారేజీలోకి పూర్తి స్థాయిలో నీరు రాకముందే గేట్లకు అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిందిగా సురేష్ కుమార్ ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. బ్యారేజీలోని 1, 2, 3, 5 నంబర్ గేట్లకు మరమ్మతులు చేస్తే ఈ సీజన్ వరకూ సరిపోతుందని శేషగిరిరావు తెలిపారు. ఐదో నంబర్ గేటు గత డిసెంబర్ వరదల సమయంలో అసలు పైకి లేవలేదని, దీని అడుగున సగం మేర రేకు పాడయిందని తెలిపారు. దీనికి కొత్త రేకు, అవసరమైన పరికరాలు అమరుస్తామని ఆయన చెప్పారు.



బ్యారేజీ గేట్లు ఎత్తే యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డ్రెయిన్లలో పూడికతీత పనులు



చినశంకర్లపూడిలో డ్రెయిన్‌లో పూడిక తీయిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో రహదారికి ముంపు నుంచి విముక్తి కలిగించేందుకు డ్రెయిన్లలో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు. చిన్నపాటి వర్షం వచ్చినా సరే గ్రామంలోని బీసీ కాలనీ కృష్ణుని ఆలయం నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకూ ఉన్న రహదారి ముంపునకు గురవుతోంది. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ ఏపూరి రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సదరు రోడ్డుకి ఇరువైపులా డ్రెయిన్లలో పూడిక తీత పనులను చేపట్టారు. పిల్లా వారి తూము నుంచి కృష్ణాలయం వరకూ డ్రెయిన్‌ను శుభ్రం చేస్తున్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నరసింహనాయక్



కొత్తూరులో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నరసింహనాయక్
- ప్రతిపాడు సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ప్రత్తిపాడు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీలోని వార్డులను పరిశీలించి రోగుల స్థితిగతులను, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా కేసులు విజృంభించే అవకాశాలున్నందున వైద్యారోగ్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని రక్షిత మంచి నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు క్లోరినేషన్ చేపట్టాలన్నారు. పంచాయతీ అధికారులు క్లోరినేషన్ లాగ్ బుక్ నిర్వహించడంతో పాటు పైపులైను లీకేజీలను తరచూ తనిఖీ చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో సర్వే చేసి డయేరియా కేసులు గుర్తించి బాధితులను దగ్గరలోని ఆసుపత్రులకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దాపురం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత, ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య, రాచపల్లి, పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆర్.పవన్‌కుమార్, మురళీమోహన్ గీతా సుధ తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారి నరేష్

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

గండేపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కేవీ నరేష్ తెలియజేశారు. స్థానిక ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, నిల్వ ఉంచిన పదార్థాలను తినకూడదన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్నే భుజించాలన్నారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని, దోమకాటు నుంచి రక్షణ కోసం దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. ఎవరికైనా వాంతులు, విరోచనాలు అయితే ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన జింక్ మాత్రలు విధిగా వేసుకోవాలని, ప్రతి శుక్రవారం ఇంటింటా తప్పనిసరిగా డ్రైడే పాటించాలని చెప్పారు.

దోమ తెరలు ఉపయోగించుకోవాలి

శంఖవరం: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో మంగళవారం ఆమె ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సౌమ్యశ్రీ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమ తెరలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధి వచ్చినవారికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని అది ప్రమాదకరమన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎంయూకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థిని కోతుర్తి హరిప్రియ గాయత్రి ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ(ఐఎంయూ)కి ఎంపికైంది. ఆదిత్య విద్యా సంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి ఈ విషయం తెలిపారు. ఆలిండియా ర్యాంక్ 326తో ఎంబీఏ-ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌లో గాయత్రి సీటు సాధించిందని పేర్కొన్నారు. ఆమెను డిగ్రీ కళాశాల సెక్రటరీ ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ విజయ భార్గవి, విభాగాధిపతి ఎం గోవర్ధన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

మండల బీజేపీ అధ్యక్షురాలిగా పద్మావతి

కరప: మండల బీజేపీ అధ్యక్షురాలిగా గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి పద్మావతి నియమితులయ్యారు. ఈమేరకు కాకినాడ పార్లమెంటరీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు రామ్‌కుమార్ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్టు పద్మావతి స్థానిక విలేకరులకు తెలిపారు. ఆమెను పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

తాళ్లూరు లిఫ్ట్‌కు పూర్తి స్థాయి మరమ్మతులు



తాళ్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల

గండేపల్లి: తాళ్లూరులోని పుష్కర లిఫ్ట్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న సీఎస్ పైపులైన్ల స్థానంలో ఎంఎస్ పైపులు వేసేందుకు రూ.49 కోట్లు అవసరమన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎన్నో రోజులు కానందున నిధుల మంజూరుకు ఇంకా సమయం పడుతుందని చెప్పారు. ఏడాది కాలంలో లిఫ్ట్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు. మురారి, సింగరంపాలెం, కె.గోపాలపురం, గండేపల్లి తదితర గ్రామాల్లోని రైతులకు మేలు చేసేలా గండేపల్లి వద్ద రూ.25 కోట్లతో కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో మల్లవరం, గోవిందపురం గ్రామాలకు ఎత్తిపోతల పనులు రూ.139 కోట్లతో ప్రారంభించామని, దీనిని పూర్తి చేస్తామని తెలిపారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాలకు రూ.5 కోట్లతో నీరందించే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు వై.జగదీష్, సీహెచ్ రామతులసి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించండి



తునిలో బడిఈడు పిల్లలపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

తుని: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓ పరవాడ గీతాదేవి విజ్ఞప్తి చేశారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజా హైస్కూలు హెచ్ఎం టి.శేషగిరి ఆధ్వర్యంలో మంగళవారం బడి బయట పిల్లలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గీతాదేవి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.రామకృష్ణ, మెప్మా, మహిళా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చంద్రశేఖరస్వామి కల్యాణం



జగ్గంపేటలో చంద్రశేఖరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జగ్గంపేట: స్థానిక సర్వకామదాంబ సమేత ఉమా చంద్రశేఖర స్వామివారి 34వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కొత్తలంక కామేశ్వరరావు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ క్రతువును తిలకించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని పచ్చి పువ్వులతో సుందరంగా అలంకరించారు. ఆదివారం ఆలయ ఆవరణలో భారీ అన్న దానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.